శరత్ చెప్పిన కథ :

చంద్రముఖి

ఏదో పత్రికలో ఓ మాటు శరచ్చంద్రునిపైని దుమ్మెత్తి పోస్తూ, దుయ్యబడుతూ ఓ వ్యాసం పడింది. శరత్‌బాబావేళ తన నేస్తులతో దాన్ని గురించే ప్రస్తావించి యిలా చెప్పటం మొదలెట్టాడు.

"ఇంతకూ నాపైని వాళ్ళు మోపిన మహా నేర మేఁవిటనుకున్నారు?— నే నేదో గొప్ప పాపాత్మురాళ్లను - పాపిష్టిపిండాల్ని యింత మనోహరంగా - యింత పవిత్రంగా చిత్రించానట! నే నెప్పుడు చూసినా అలగా వాళ్ళనీ. పతితుల్నీ. తప్పుడాళ్ళనీ. అనాడీల్నీ అందలాని కెక్కించి అదే పనిగా సమర్థించేస్తున్నానట! కాని యిందులో నిజం చెప్పాలంటే నేను లవలేశమైనా అలాంటి వాళ్ళని సమర్థించటం లేదు. కానైతే వాళ్ళని మాత్రం అందరికిమల్లే అవమానించటం నాకు ససేమిరా యిష్టంలేదు. వాళ్ళు కూడా అందరిలాగా మనుషులే అంటాను. తమ గోడు చెప్పుకునేందుకు వాళ్లక్కూడా అధికారం వుందంటాను. ఇంతే గాకుండా పరిపూర్ణమైన మానవత్వం పాతివ్రత్యంకన్నా చాలా దొడ్డదని నా తలంపు. ఎంతో గొప్ప మహా పతివ్రతలైన స్త్రీలు సైతం దొంగతనం పింజారీ పనులూ చేస్తూండటం. తప్పుడు సాక్ష్యాలు కూడా చెప్పటం నేను కళ్లారా చూశాను. అందుకు విరుద్ధమైన విషయాలు కూడా చూశాను. మీ కిప్పుడో కథ వినిపిస్తా. నేను కళ్లారా చూసింది కాకపోయినా అచ్చంగా జరిగిన కథ యిది. ఈ కథకి సమ్మంధం వున్న యిద్దరు మగరాయుళ్లూ నాకు మంచి నేస్తాలు. వాళ్లే యీ కథంతా విడమరిచి నాకు చెప్పారు:

ఇప్పుడు నేను చెప్పొస్తున్న యిద్దరాసామీలూ ప్రాణస్నేహితులు. ఓ కంచాన తిని ఓ మంచాన పడుకునే వాళ్ళు. అంత జోస్తీ వాళ్ళిద్దరకూ:

సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీ

బహూనాడా యిద్దరు మిత్రులూ చెట్టాపట్టాలు కట్టుకుని తిరుగుతూ యేదో వేళాకోళానికని భోగంవాళ్ల పేటకి షికారుగా వెళ్ళారు. వెళ్లేప్పుడు కాస్త కాస్త సారాయి కూడా చంకను పట్టిగెళ్ళారు.

వాళ్లలా దూరిన ఇంట్లో ఓ అమ్మాయి ఒయ్యారం ఒలకబోస్తూ తైతక్క మని ఆడుతోంది. కమ్మ కమ్మగా జావళీలు పాడుతోంది. ఆమెకి ఆటా – పాటా క్షుణ్ణంగా వొచ్చు. ఇద్దరు నేస్తులూ మేజువాణీ మజా మజాగా చూసుకుంటూ కొద్దికొద్దిగా సారా సేవించటం మొదలెట్టారు. మరి కొంతసేపటికల్లా వాళ్లకి మత్తుగా కైపెక్కింది. ఎవళ్ళు ఏ పక్క కొరిగిపోతున్నారో ఒకరొకళ్ళకి తెలీకుండా వుంది. కైపుమజాలో అటూయిటూ తూలి తేలిపోతున్నారు. ఆఖరికి ఒంటిపైని గుడ్డ లెక్కడ పడిపోయాయో కూడా తెలీని పరిస్థితొచ్చింది. చొక్కా ఓ మూలా పంచె మరో మూలా – తువ్వాలా యింకో చోటా చిందర వందరగా జారిపడ్డాయి. చివరి కేం గావాలో అంతా అయింది.

మొన్నా డుదయం కైపు కాస్తా దిగజారిపోగానే వాళ్ళిద్దరూ మళ్లా యీ లోకంలో బడ్డారు. మామూలు మనుషు లయ్యారు. ఒహాతను తెలివి తెచ్చుకుని నడుంపైని చేతుల్ని మోపి- "అయ్యబాబోయ్, ఎంతపనైపోయింది – నా బ్రతుకే బండలైంది." అని అరుస్తూ నరికిన అరటిబోదుకమల్లే అక్కడే కూలబడిపోయాడు.

అతగాని గావుకేకలాలకించి రెండో మహానుభావుడు లేచాడు. కళ్ళు నులుముకుంటూ, – "ఏవిటోయ్ నీ గోల ?- ఏం పుట్టిమునిగిపోయిం దనీ?" అన్నాడు.

"అది కాదురా బాబూ, నా మొలను మూడువేల రూపాయిల నోట్లకట్ట దోపుకున్నా. అదేమయిందోగాని యిప్పుడు కనిపించటం లేదు. నువ్వేగాని తీసి దాచావా ?" అని అడిగా డాతృతగా తొలిమిత్రుడు.

"అబ్బ, నాకేం తెలుసునోయ్. నిన్నరాత్రిబట్టీ అసలు నే నీ లోకంలోనే లేనుగా ! – నీ గోలా, గలాటా విని యిప్పుడేగా తేరుకుని యీ లోకంలో పడ్డాను."

"అయ్యయ్యో, అంతా నాశనమైపోయింది. అది నా సొమ్ముకూడా కాదాయిరి ! పరాయివాళ్ల సొత్తు ! – తీసుకెళ్లి మళ్లా యివ్వకపోతే నా వుద్యోగం గోవిందా ! పైపెచ్చు బందిఖానా పాలుగాక తప్పదు. పోనీ పట్టుకెళ్లి తీర్చేద్దామంటే పట్టుమని పది రూపాయిలైనా చేతిలో లేవు. పదో-

పరకో అయితే యెక్కడో తల తాకట్టయినా పెట్టి వాళ్ల మొహాన గిర వాటేసి వేసేవాణ్ణి. మొత్తం మూడు వేలు! - యింత రొఖ్ఖం యిప్పుడెక్కణ్నుంచి తేవటం? - గంగలో దిగాలిగాని గత్యంతరం లేదు. అయ్యయ్యో, ఎంత నామర్దా! ఎంత ఆపత్తు! - ఏం చెయ్యటం?" అని తత్తరపడుతూ పెడబొబ్బలు పెట్టటం మొదలెట్టాడు. పాపం పతి మహా బెంబేలు పడిపోయాడు. బెంగంటే బెంగ కాదూ! ఒహటా - పదా, మూడు వేల రూపాయిలు పుత్తపుణ్యానిక పోయాయంటే యెంతటివాడికైనా యేడుపు రాకండా వుంటుందా?-

అయినా యిలా యేడుస్తూ మొత్తుకుంటూ కూచుంటే పోయిన డబ్బుకి కాళ్లొచ్చి యెక్కడేనా తిరిగొస్తుందా?- అతగాడు పాపం యిల్లంతా కళ్ళు ట్యూబులైట్లు చేసుకుని మరీ గాలించాడు. కాని డబ్బు కంటబళ్లేదు. తప్పత్రాగి మైకంలో వున్నప్పుడు మామూలుగా జరిగే పన్లేగా యివి!- అఫళంగా యిద్దరు మిత్రులకూ భోగంపిల్ల చటుక్కున గ్యాపకానికొచ్చింది. నిన్న రాత్రి మేజువాణీ చేసిందే, ఆ భోగంపిల్ల యేమయిందీ? - యెక్కడికి పోయిందీ? - అస లామె అజా - పజా యే లేదు. రాత్రిపూట వాళ్లిద్దరూ సారామత్తులో వుత్తీ - సుత్తీ లేకుండా తుప్పలా కూలిపోయిన సందట్లో అదే మంచి అదననుకుని ఆమెగాని ఆ డబ్బుకట్ట కాస్తా కాజేసి ఖుస్తుం చేసుకోలేదు గదా! - ఆమే మమ్మాటికీ యీ దొంగపనికి తలపడుతుంటుంది. లేకపోతే యింత యింట్లో, అదీ బొడ్లో దోపుకున్న యిన్ని రూపాయిలు యింత గుట్టుచక్కంగా యెలా గైర్హాజరియా అయిపోతాయి?-

సరిగ్గా యీ సమయానికే, వాళ్ళు పరిగురించయితే వూసులాడుకుంటున్నారో ఆ యమ్మాయే యకాయకీని యింట్లో అడుగుపెట్టింది. డబ్బు పోగొట్టుకున్న ఆసామీ దుఃఖం ఆపుకోలేక దిక్కుమొహం పెట్టి ఆమెని చూసీ చూడగానే భోరుమని యేడవడం మొదలెట్టాడు. తన మొల్లో దోపుకున్న పైకం పోయిందనీ, అందువల్ల తన పనికాస్తా తిరుపువరం కానటమేగాకుండా శ్రీకృష్ణ జన్మస్థానానికి కెళ్లాల్సిన ఖర్మం పడ్తుందనీ ఆమెకి తన గోడంతా సవిస్తరంగా చెప్పుకున్నాడు.

అంతా విన్నమీదట ఆ యమ్మాయి యిలా చెప్పింది:- "అయ్యా, నిన్న రాత్రి సారాకైపులో వున్న మీరిద్దరూ పక్కమీంచి క్రిందకొరిగి పడిపోయారు. మీ స్థితి చూస్తే నాకేం

ఏటో వల్లమాలిన జాలి పుట్టుకొచ్చింది. ఉన్నపళంగా మిమ్మల్ని లేవదీసి మీ తలల క్రింద దిళ్ళు పెట్టాను. అప్పుడే మీరు నన్నేవో తిట్లు తిట్టూ అంటున్న పుల్లవిరుపు మాటలకి నేనేమీ ఉక్రోషం తెచ్చుకోలేదు. వాటిని లెక్క చెయ్యలేదు కూడాను. ఇది మా బ్రతుకుల్లో నిత్యం వాళీగా జరిగే ముచ్చటేగా మరి!- వెధవకర్మ! - తిట్లూ - ఛీవాట్లూ విని విని మా చెవులు ఘడులడి పోయాయి. బుర్ర దిమ్మెక్కిపోయింది. కాండ్రించి మీదను వుమ్మేసినా కిమన్నాస్తిగా వుండిపోతాం. ఎన్ని అవమానాలు జరిగినా వాటిని సహించుకుని బెల్లంకొట్టిన రాళ్ళలాగ పడుండటం మాకు రివాజై పోయింది. ఇదంతా యెందుకులెండి. మిమ్మల్నిద్దరినీ నిద్రపుచ్చి చూసేసరికి ప్రక్కనో రూపాయిల సంచి పడుంది. తీసి చూస్తే కళ్ళు జిగేలుమన్నాయి. అందులో వేలకొద్దీ రూపాయిలున్నాయి. రాత్రంతా జాగారం వుండి దానికి కాపలా కాస్తూ నేవున్నా. ఈ పేట వుంది చూశారూ, మహా చెడ్డది. మీకూ తెలుసు ననుకుంటా. ఎన్నెన్నో రకాల వాళ్ళిక్కడికొస్తుంటారు. గూండాలూ- రౌడీలూ త్రాగుబోతులూ పొద్దాకులూ ఝిల్లీలూ కాలుగాలిన పిల్లుల్లాగ తిరుగుతుంటారు. మీ దగ్గర బాగా డబ్బుందని ఎవరో రౌడీలకి ముందుగానే ఆచూకీ తెలిసినట్టుంది. వాళ్ళు మీ వెంటబడి నట్టుంది. అందుకని ఈ యింటి గుమ్మం ముంగిలికి కూడా కొందరు రౌడీలు తచ్చాడ్తూ తిరిగారు. కానీ నన్ను చూసి లోపల అడుగు పెట్టేందుకు మాత్రం తటపటాయించారు. వాళ్లకు ధైర్యం చాల్లేదు. అలగా ముండావాళ్ళు కాస్తంత డబ్బుకోసం కక్కుర్తి పడి కూనీలు సైతం చేసేందుకు వెనకాడరు. మీరీ డబ్బుతో బయట పడ్డారంటే దీనికోసం మిమ్మల్ని కూడా అలాంటి అఘాయిత్యానికే పూనుకుంటారని అనుమానపడ్డాను. ఇహ ఇక్కడ నా పరిస్థితెలాంటిదో గమనించండి. నా దగ్గర చూస్తే వేలకొద్దీ రూపాయిల మూట వుంది. బయట చూడగా రౌడీ వెధవలు మీసాలు మెలేసి పచార్లు గొడ్తున్నారు. నాకు వల్లమాలిన భయం పుట్టుకొచ్చింది. ఇంట్లో పొయ్యి ముట్టించి దాసీదాన్ని దగ్గిర పెట్టుకుని రాత్రంతా యెంతో కష్టమ్మీద కంటిమీద కునుకు లేకుండా యెలాగో గడిపేశాను. తూరుపు తెల్లవారకమునుపే బయల్దేరి యిక్కడికొచ్చేశాను.''

ఇలా ఆ పిల్ల చెప్తూ. చెప్తూ తన కచ్చలో దాచిపెట్టిన రూపాయిల

మూట చటుక్కున పైకితీసి వాళ్ళ ముందు వుంచేసింది.

కథను ముగిస్తూ శరత్ బాబు యిలా అన్నారు:— "ఈ అమ్మాయి గొప్పతనం యేమిటో మీరో గడియ ఆలోచించి చూడండి. ఈమె కాసిని డబ్బులకోసం భోగం వృత్తిని వ్యాపారంగా చేసుకుందాయిరి! ఎవరో ఒహారి అవాత్రిలో వుండి ఆ డబ్బు కోసం అంతులేని అవమానాల పాలవుతుందాయిరి!—అలాంటప్పుడా మూడు వేల రూపాయిలూ కంటపడగానే చేజేతులా జారవిడుచుకుంటుందా? ఇదేం మామ్మూలు విషయమా చెప్పండి. డబ్బుకాస్తా కాజేసి నాకేం తెలీదు పొమ్మన్నా ఆమె నెవరూ పల్లెత్తుమాటన్నా అనడానికి దమ్ములు కూడా చాలవుగా!—ఇందుకే అంటున్నా పైపై మెరుగులు చూసి మోసపోవొద్దని. మొహాన్నీ ఆకారాన్నీ బట్టి మనం ఒవారి నైజంలోని నిజానిజాల్ని తెలుసుకోలేం. వీళ్ళుకూడా మనుషులే. వీళ్ళకూ హృదయమంటూ వుంది. వీళ్ళ సత్ప్రవర్తన అణుమాత్రమూ చావలేదు. అయితే యింతకూ వీళ్ళలాంటి తప్పుడుదారి యెందుకు తొక్కారూ అంటే అందుకు సమాజమే సరైన సమాధానం చెప్పగలదు; ఎందుకంటే అలా కావడానికి దానిదే బాధ్యత కనక! హృదయాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే మన సమాజంలో వుండే సతీసాధ్వులయిన ఆడవాళ్ళందరికన్నా యే విషయంలోను వీళ్ళు తీసిపోరంటాను.

ఈ భోగంపిల్ల కథా—కమామీషూ విన్నమీదటే నా కళ్ళు తెరచుకున్నాయి. అసలు విషయం గ్రహించాను. దాన్నిబట్టే 'దేవదాసు' కథలో 'చంద్రముఖి' చరిత్రను సృష్టించగలిగాను. ఆ పాత్ర గౌరవమంతా ఈ అమ్మాయిదే అనాలి మరి! ఈమే అసలు చంద్రముఖిని సృష్టించిందన్నా అతిశయోక్తి కాదు!"

"శరతేర్ బైరక్ కథ" ఆధారం.